# నా మదిలో ఓ గది

**సుధారమ**

**"శనివారం రోజూ ఆమ్లేట్ చేస్తున్నావా పద్మా! పోనీ కనీసం ఆ వంటింటి అరుగైనా శుభ్రంగా కదుగు తల్లీ. నేను కాఫీ కాచుకోవాలన్నా కష్టం. అంతా ఏకమై కూర్చుంటుంది" అత్తగారి నస నా వెనుక. ఇక ఆఫీసుకి వెళ్లడానికి పదినిమిషాలే ఉన్నాయి. అంతలో ఈ పని ఒకటి పడింది. వేడిగా నేతిలో ఆమ్లేట్లు వేసిస్తే ఇష్టంగా తింటాడు మా అబ్బాయి రవి. ప్రొద్దుటి టిఫిను వాడిష్టప్రకారం చేస్తే మధ్యాహ్నాం వంటకి వంకలు పెట్టకుండా తింటాడు. మా ఇద్దరి ఒప్పందం అది. ఈ తరాల అంతరాలతో ఎవరితో సర్దుకోవాలో అర్థం కాదు. సణుక్కుంటూ ఆమె చెప్పిన పని చేసి బయటపడ్డాను.**

సాయంత్రం మా అత్తగారు గుడికెళ్ళారు. పక్క ఇంటి అనసూయమ్మ పిన్ని వచ్చారు. మేమిద్దరం పుస్తకాలూ, పత్రికలూ ఒకరివొకరు మార్చి చదువుకుంటాము. వయసులో ఇంచుమించు మా అత్తగారి వయసుదే పిన్ని. అయినా ఆమె ఆలోచనలూ, అభిరుచులూ వేరు. మా అత్తగారిలా మడీ, ఆచారం వెరసి చాదస్తం లేవు. కాలానికి తగినట్లు మనుషులూ మారాలి. అప్పుడే సుఖం.

పిన్నితో అదే అన్నాను. "ఏన్నేళ్ళయినా ఒక్కటేలా ఉండాలంటే ఎలా పిన్నీ? ఇరవై ఒకటో శతాబ్దంలోనూ పద్ధెనిమిదో శతాబ్దంలోలా బతకాలంటే వీలవుతుందా? వీలైనంత చేస్తూనే ఉంటా. నా ఇబ్బంది అర్థం చేసుకోరు. వంట మొదలుకుని అన్నీ ఆమె చాదస్తం ప్రకారంగానే జరగాలి. నాకూ స్వతంత్రంగా హాయిగా ఉండాలనుంటుంది అందర్లాగే. కొంచెం ఎదురు చెప్పానా, రంపులూ రాద్ధాంతాలూ. ఈయనేమో "మా అమ్మ నాకోసం ఎంతో కష్టపడిందీ నాన్న లేకపోయినా కంటికి రెప్పలా పెంచిదీ కాస్త సర్దుకోలేవా నీవు. ఇన్నేళ్ళు బతికిన ఆమె ఇంకా ఎంతకాలం బతుకుతుందా? ఆమెనిప్పుడు మారమంటే మారుతుందా? ముసలివాళ్ళకి పిడికెడు ప్రశాంతతని ఇవ్వడం మన బాధ్యత" అంటూ చెప్పుకుపోతారు. ఇట్లా ఎదుటివాళ్ళ ఆనందాన్ని పాడుచేసే సంప్రదాయాలూ ఆచారాలూ ఎందుకుట? ఇక వీళ్ళు ఎప్పుడు చస్తారా అని ఎదురు చూట్టానికా? నిజం నిష్ఠూరంగానే ఉంటుంది. నాకోసారి ఒళ్ళు మండిపోతుంది నా అవస్థకి'.

పిన్ని నా మంటని ఎగదోయదు. కాస్త తగ్గాక, చల్లబరచి వెళ్ళిపోతుంది. "నిజమే నీకు హేతుబద్ధంగా ఆలోచించడం అలవాటు. కానీ వాళ్ళతరం వేరు. నాకు తెలిసి మీ ఇంట్లో కోడి గుడ్డు అన్న పదం కూడా వినపడేది కాదు. ఇప్పుడు రవి బలహీనంగా ఉన్నాడని నీవు నచ్చజెప్తే ఆమె ఒప్పుకున్నారుగా అయిష్టంగానైనా. మీ అమ్మలా చెప్తున్నాను పద్మా. సంసారం అంటే చిటికెడు సర్దుబాటు. మీరు తప్ప ఆమెకెవరున్నారు చెప్పు? ఆమె మడీ, తడీ తప్పించి ఆమె మనసెంత మంచిది – ఆలోచించు" అంది.

"ఏమో పిన్నీ నేను మాత్రం నా కొడుకు జీవితంలో జోక్యం పెట్టుకోను. వాళ్ళ బతుకు వాళ్ళిష్టం. వాళ్ళు ఏ అమెరికాకో వెళితే సరేసరి. ఇక ఇదే ఊళ్ళో ఉన్నా వాళ్ళు వేరేగా మేము వేరేగా ఉంటాం. 'హలో' అంటే 'హలో' అనుకుని స్నేహితుల్లా ఉంటే సరి. ఎంతైనా కలిసుంటే ఏదో ఓ రకంగా జోక్యం తప్పదు" అన్నాను.

పిన్ని చిన్నగా నవ్వింది. "ఇప్పుడలాగే అనిపిస్తుందే పద్మా. వృద్ధాప్యం ఉంది చూడు శరీరంతోపాటు మనసునీ బలహీనం చేస్తుంది. 'నా' అనుకున్నవాళ్ళు మనతో ఉండాలన్న భావం ఎక్కువవుతుంది. ఆమెరికాలోనో, మరో చోటనో పిల్లలుండే తల్లిదండ్రులు వాళ్ళ బంగారు భవిష్యత్తు కోసం ఇక్కడ ఒంటరి తనపు ఒడిలో బతుకుతున్నారు గతిలేక. ముసలితనంలో తోడుకేగా బిడ్డలు. నోటితో ఏమైనా అనొచ్చు. ఆచరణలో కష్టం' అని వెళ్ళిపోయింది.

ఆలోచిస్తూ కూర్చుండిపోయాను. మార్పుకి తగినట్లు మనసుని మలచుకునేలా చేయడం సాధ్యమేనా? రేపు నా కోడలు చికెన్ వండితే

## వి'చిత్ర' వ్యాఖ్య పోటీ ఫలితం - 27

మేము ప్రారంభించిన వి'చిత్ర' వ్యాఖ్య పోటీలో మా ఊహకు మించి పాఠకులు పాల్గొని వ్యాఖ్యలు పంపారు. అందరికీ మా అభినందనలు. మాకు వచ్చిన (21-07-2004 సంచిక) వ్యాఖ్య లలో ఈ క్రింది వ్యాఖ్యను ఉత్తమంగా ఎన్నిక చేయడమైనది.



*" వింతల్లో వింతైనది జీవితం*
*చిత్ర విచిత్రాల నవరస భరితం"*

**పంపినవారు**

**టి. రామ్మోహన్, విజయవాడ**

*వీరికి ప్రియదత్త వారపత్రిక మూడు మాసాల పాటు అందజేస్తాము. – ఎడిటర్*

నేను భరించగలనా? మరి కలిసి ఉండడం ఎలా సాధ్యం? నాకు భరించలేని విషయాలు వాళ్ళకి సాధారణం కావచ్చు. నా ఆలోచనల్లోనే ఉండే రవి ఎప్పుడు వచ్చాడో నెమ్మదిగా నా దగ్గరకొచ్చి కూర్చున్నాడు.

ఈ మధ్య తొమ్మిదో తరగతికి వచ్చినప్పట్నుంచీ మునుపట్లా ముద్దులు పెట్టడం, దగ్గరికి రావడం తగ్గించాడు. పెద్దవాడయ్యాడుగా కాస్త గంభీరత్వం వస్తుంది. ఈ రోజేమో నా ఒళ్ళో మొహం పెట్టుకున్నాడు. 'ఏరా ఏమైందీ' అన్నాను లాలనగా. "మమ్మీ నేను అమెరికా వెళ్ళనుగా, డాక్టరయి ఇక్కడే వెళ్లి ప్రజలకి సేవ చేస్తానని మొన్న డిబేట్‌లో కూడా చెప్పేశా. నేను డాక్టరునవుతానా మమ్మీ" అన్నాడు. "నీవు కావాలనుకుంటే తప్పకుండా అవుతావు. బాగా చదవాలి మరి" అన్నాను నా ధోరణిలో.

"మమ్మీ, నీవూ డాడీ నేనెక్కడుంటే అక్కడుంటారుగా నాతోపాటే" ఆపి నా కళ్ళల్లోకి చూశాడు. "డాడీ బామ్మని అడుగుతాడుగా ఆవకాయ ముద్ద కలిపి పెట్టవే' అని. నేనూ నిన్నప్పుడు అడుగుతాగా - 'మమ్మీ ఫ్రూట్‌సలాడ్ ఇవ్వూ' అని. నాన్నేమైనా సంతోషం ఎక్కువైపోతే 'మా అమ్మే ఓ అమ్మాయ్ బంగారమ్మ' అని బామ్మ చేతులు పట్టుకుని గట్టిగా ఊపేస్తాడే నేను కూడా హాపీగా ఉన్నప్పుడు నీ దగ్గరకొచ్చి అలా సెలబ్రేట్ చేసుకుంటా ఏం? నీ కోసం ఓ పెద్ద గది అలాగే పూర్తిగా నీ కోసం ఎట్లా పెడతానంటే అందులో నీ పుస్తకాలూ, వీణా, సీనరీలూ, ఫ్లవర్ అరేంజ్‌మెంట్సూ - నాకు టైమున్నప్పుడు మనిద్దరం ఛెస్ ఆడుకుందాం ఆ గదిలో. నువ్వు నా దగ్గరే ఉండు మమ్మీ. నే నిన్నొదిలి ఉండలేనుగా. అందులో నీవప్పుడు ముసలిదానివై ఉంటావు. నేను నిన్ను చూసుకోవద్దూ" అని అంతలో "మా మమ్మీ ముసల్ది కాదసలు" అనేసి "ప్రామిస్ మమ్మీ ప్లీజ్" వాడి కళ్ళల్లో సన్నటి నీళ్ళతెర నా కళ్ళల్లో కదిలి రెప్పల్ని దాటబోయిన నీటి చుక్కల్ని నిలిపేసి 'సరే పద అన్నం తిందాం నిన్ను వదిలి నేనెక్కడుంటాను. ఊరికే తమాషాకి అన్నా అంతే" అని లేచాను.

వాడి ఊహాశక్తికి ఆశ్చర్యం కలిగింది. నా అందమైన కల నే ఊహించని కల. నా మదిలో ఓ గది నా మనమడో మనమరాలో అందులో వచ్చి నా వీణని ఓసారి మీటి ఓహ్! కల విస్తరిస్తోంది. హృదయం కరిగిపోతుంది. దాంతో నేనేదో మా అత్తగారితో మునుపటి కన్నా చాలా మంచిగా ఉండి, ఆమె 'నస'నీ 'చాదస్తాన్నీ' అర్థం చేసుకుంటూ హాయిగా ఉన్నానని కథని సినిమాటిక్‌గా ముగించడం ఆత్మ వంచనే. కానీ రోజులో ఎప్పుడో నా మదిలో వాడు ముద్ర వేసిన ఆ గది కదిలి నన్ను కరిగిస్తోంది. రోజులో ఓసారి మా అత్తగారిపట్ల నా మనసు ఆర్ద్రమవుతుంది.

కలలు నిజం కాకపోవచ్చు. కానీ మనిషికి బతకడానికి టానిక్కు కలేగా. ❁



